

# గుండె గొంతుక

## కొడవంటి కాళీపతిరావు

పెద్ద సంసారం ఉన్నప్పటికీ ఆర్థికబలం ఉన్న కుటుంబీకుడు సులువుగా సంసారాన్నీడుస్తున్నట్లుగా వెనకాల బోలెడు పెట్టెలూ. పెట్టెల నిండా బోలెడు జనం ఉన్నప్పటికీ తాజుగా పరిగెడుతూ ఉత్సాహంతో కేకలు పెడుతోంది డీసెలింజను. మోటారులాంచి ముందుకు దూసుకుపోతూంటే నీరంతా వెనక్కి నెట్టబడుతున్నట్టుగా గాల్లో రాంబాణంలా రైలు దూసుకుపోతూంటే అంత వేగంగానూ వెనక్కి తప్పుకుంటున్నాయి చెట్లూ, చేమలూ.

పార్థసారథి చాలా కోపంగా ఉన్నాడనే కంటే ఎక్కువ కసిగా ఉన్నాడంటే బాగుంటుంది. కాకపోతే ఇంకెప్పుడైనా రైలు ప్రయాణం చేస్తూన్నప్పుడు ఇంకా స్పీడుగా, మరింత స్పీడు స్పీడుగా వెళ్తే బాగుంటుందని సరదాపడేవాడు. లేదా ఒక స్టేషను నుంచి మరో స్టేషనుకు ఎంత సేపట్లో వెళుతుందో కనిపెట్టి, దాని ద్వారా వేగమూ, రేటూ మొదలైన స్టేటిసిక్స్ తీసుకుంటూ కాలక్షేపం చేసేవాడు.

పార్థసారథి కిప్పుడేకాదు సహజంగానే ప్రపంచం మీద విపరీతమైన కసి, కోపం వున్నాయి. తనంతటి తెలివైనవాడు తాలూకాఫీసులో డిస్పాచింగ్ క్లర్కులాంటి ఉద్యోగంలో కాకుండా కలెక్టరాఫీసులో కలెక్టరు కాకపోయినా పియ్యేలాంటి కీలకమైన ఉద్యోగంలో వుండవలసిన వాడినని అనుకుంటూంటాడు. అంతేకాదు పెద్ద ఉద్యోగాల్లో ఉండే తన పరిచయస్తుల్ని అసమర్థులిగా గుర్తుచేసికొని తను వాళ్ళకి తీసిపోలేదని తృప్తి పడుతూంటాడు. అయితే తన సామర్ధ్యం, తెలివి తేటలమీద ఇంత నమ్మకం ఉన్నప్పటికీ తన సంసారం తను ఎడపలేకపోవడంలో వాటి సాయం లేకపోవడం గూర్చి అతను విచారిస్తూంటాడు. చిన్న చిన్న సరదాల్లో తనకు జరిగిన అన్యాయం పార్థసారథి మరచిపోతూండి నప్పటికీ కొన్ని కొన్ని

---

నీ కుడిపక్కవాన్ని నువెట్లా చూస్తావో, నీ యెడమ పక్కవాడు నిన్నట్లా చూస్తాడు. కుడి ఎడమైతే పొరపాటులేదు. అద్దంలో నీ ముఖమే కనపడితే ఆశ్చర్యమూ లేదు.

---

సంఘటనలూ, కొందరు కొందరు మనుషులూ తిరిగి జ్ఞాపకం చేస్తూంటారు. తిరిగి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా పార్థసారథికి కోపం, కసీ క్రమక్రమంగా పెరుగుతుంటాయి.

అలాగే ఆ రోజు భయంకరమూ, ప్రమాదకరమూ అయినప్పటికీ చాలా సరదానిచ్చేదైన రైలు నెక్కబోయేటప్పటికి అతను సంతోషంగానే ఉన్నాడు. పార్థసారథి కూర్చున్న సీటుకి ఎదురుగ్గా అతని కళ్ళముందరే వచ్చి నలుగురు కూర్చుండవలసిన సీట్లు కలిపి, దుప్పటి పరిచి బెర్తులా చేసుకుని గుర్రుపెట్టడం మొదలెట్టిన షావుకారిని చూసేటప్పటికి పార్థసారథి కెక్కడలేని ఉక్రోషమూ వచ్చింది.

ఆ షావుకారు నిద్రపోతున్నప్పుడు పార్థసారథి దృష్టి అతని పొట్టమీదపడింది సజీవంగా ఉన్న కొండలా....ఊపిరి తీసినపుడల్లా పైకీ, కిందకీ కదుల్తుండడమే కాక బోర్లించిన బిందెలో టపాకాయ పెట్టి కాలిస్తే బిందె తుళ్ళి తుళ్ళిపడినట్టు పెద్దగురక రాగానే ఆ పొట్ట ఎగిరెగిరి పడుతోంది.

అతను నిద్రపోని టైములో కూడా పార్థసారథి దృష్టి అతని పొట్టమీదకే కేంద్రీకృతమై వుంది.

ఆ షావుకారికి తినడానికీ, నిద్రపోడానికీ స్వాతంత్ర్యం లేదని పార్థసారథి అనడు. కాని నలుగురు కూర్చోవలసిన సీట్లు ఆక్రమించి నిద్రపోవడమూ, నిద్రపోని కాలంలో వీరమఠం వేసుకొని చుట్టూ వున్న వాళ్ళని పులుకూ పులుకూ చూస్తూ గుటుకూ గుటుకూమని మింగడం చూస్తే పార్థసారథికి మొదట తలదాల్చుకోవటానికి చోటు అడిగి ఇల్లంతా ఆక్రమించిన ఒంటే, వంటింట్లో దూరిపోయి తరిమేలోపునే దొంగ చూపులు చూస్తూ అబగా పెరుగో పాలో తాగేసే పిల్లీ జ్ఞాపకం వస్తున్నాయి.

ఇలాంటి వాళ్ళవల్లనే ఆహార సమస్య దేశాన్ని పీడిస్తూందని, ఇలాంటి సోమరుల వల్లనే నిరుద్యోగ సమస్య దేశంలోలేదే మో అనుకునే ప్రమాదం వుందనీ పార్థసారథికి అనిపించింది. ఆ షావుకార్ని నట్ట నడి అడివిలోకి తీసుకుపోయి ఓ చెట్టుకక్కట్టి ఆహారం తీసుకోవడం గురించీ, నిద్రపోవడం గురించీ మొదట చెప్పి తర్వాత ఆరోగ్యసూత్రాలూ, ఆ పిమ్మట దేశ పరిస్థితులను గురించి పాఠం చెప్పేసి, ఈలోగా అతను వినపట్టుగా కనిపిస్తే కొర


# కలలు-వాటి ఫలితాలు

కలలు ఎందుకు వస్తాయి? ఎప్పుడు వస్తాయి? ఏ కలకు ఫలితం ఉంటుంది? ఎలాంటి కలకు ఎలాంటి ఫలితం ఉంటుంది? అన్న విషయాన్ని గూర్చి ఆంగ్ల, సంస్కృత, తమిళ గ్రంథాల్ని పరిశోధించి, సమగ్రంగాను, విపులంగాను వివరిస్తూ వెలువడిన మొట్టమొదటి గ్రంథం.

ఇందులో పిల్లలకు, పెద్దలకు, స్త్రీలకు, పురుషులకు వచ్చే వేలాది కలలకు వివరంగా ఫలితాలు ఇవ్వబడ్డాయి. ఎలాంటి కల వచ్చినా ఇతరుల సహాయం లేకుండా తమంతట తామే ఈ పుస్తకం చదివి తమ కలల ఫలితాన్ని తెలుసుకోవచ్చు.

ఆర్ట్ పేపరుపై అందంగా ముద్రించబడిన త్రివర్ణ ముఖ చిత్రంగల జాకిట్ కవరుతో—

వెల : రు. 10-00 పోస్టేజి రు. 3-00

ప్రతులకు :

SREE ARUNA BOOK HOUSE

103, Narayana Mudali Street, MADRAS—600 001.



# క్యాన్సరు విముక్తి

నా పేరు డి. ముత్తులక్ష్మి వయస్సు 45 సం॥ సంతానం ఐదుగురు పిల్లలు నా గర్భకోశానికి క్యాన్సరుసోకినట్లు మధురాయ్ మరియు కోయంబత్తూర్ క్యాన్సరు నిపుణులు నిర్ణయించి చికిత్స జరిపారు గర్భకోశంలో ఆవకాయంత గడ్డ ఉండి బాధ పెట్టడం జరిగినది. రానురాను గడ్డ పెరుగుతూనే ఉంది వారి చికిత్స ద్వారా పెరగడమేకాని తగ్గుముఖం పట్టలేదు. అంతలోనే కొందరు వ్యాధిగ్రస్తులు తమకు డా॥ యం. బాబూరావుగారి చికిత్స ద్వార తమ ప్రాణాలు కాపాడబడ్డాయని తమకు రోగం పూర్తిగా నయమైనట్లు ప్రకటించిన విషయమును తెలుసుకొని నేను నా భర్త డా॥ బాబురావుగారి దగ్గరకు వెళ్ళి 12 వారముల మందు తీసుకొన్నాను. నా గర్భకోశంలోని గడ్డ పూర్తిగా కరిగిపోయి బాధలు కూడ తగ్గిపోయాయి. పరీక్ష నిమిత్తం ఇతర లేడీ డాక్టరికి చూయించగా నాకు పూర్తిగా క్యాన్సరు తగ్గినదని తెలియజేశారు. నేను ఒకరి ప్రకటనల ద్వార బాగుపడ్డాను. నా ఈ ప్రకటన ద్వార ఇంకా కొందరు క్యాన్సరు వ్యాధిగ్రస్తులు బాగుపడాలని ఆశతో ఈ స్టేటుమెంటు ఇస్తున్నాను. ప్రస్తుతం నేను నా ఐదుగురు బిడ్డలతో, నా పెనిమిటితో సుఖంగా, ఆరోగ్యంగా వున్నాను. నా ప్రాణాలను డాక్టరుగారు కాపాడినందుకు కృతజ్ఞతలు.

ఇట్లు

డి. ముత్తులక్ష్మి, తుక్కన్ చెట్టియార్, ఇంటి నెం. 11, సొసైటీ స్ట్రీట్. జిల్లా : మధురాయ్, తమిళనాడు.

డాక్టరుగారు పనిచేయు రోజులు :

డా॥ యం. బాబూరావు

| | |
|---|---|
| ఇంటి నెం. 1-1-271/3, చిక్కడపల్లి హైదరాబాద్, ఫోన్: 64735 | గురువారములు, శుక్రవారములు |
| హోటల్ సుధారా, ఉస్మాన్‌రోడ్, టి. నగర్, మద్రాస్-17. ఫోన్: 445164 | శనివారములు, ఆదివారములు |
| హోటల్ బృందావన్, యం. జి. రోడ్, బెంగుళూర్ | సోమవారములు, మంగళవారములు |

డాతో చెళ్ళు చెళ్ళుమనిపించాలని పార్థసారధికి కోరిక కలిగింది.

చరచరా పాకిపోతున్న పాము పాముల పుట్టను చూసి చప్పున ఆగినట్టుగా ఏదో స్టేషను వచ్చేసరికి ట్రైను ఆగింది. అది పాముల పుట్టకాదు చీమలపుట్ట అన్నట్టుగా రకరకాల తినుబండారాలూ అవీ అమ్మే వాళ్ళు చీమల్లా ఒక్కసారిగా ట్రైను మీద పడ్డారు.

అంతవరకూ కోడిలా కునుకు తీసిన షావుకారు "ఏయ్ జీడిపప్పూ" అంటూ బొంగురు గొంతుతో కిటికీలో తల పెట్టబోయి, దూరకపోతే చెయ్యిపెట్టి పిలిచేడు. జీడిపప్పువాడికి డబ్బులివ్వడానికి లాల్చీ జేబులో నుంచి పర్సుతీసి లోపలినోట్లు ఎవరెక్కడ చూసేస్తారోనని కళ్ళు మిటకరించుకుని చుట్టూ చూస్తూ అతడికి డబ్బులిచ్చేడు షావుకారు. కాని అది పార్థసారథి కంటపడటమూ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇక్కడ చిక్కడిపోయిందా అనుకోవటమూ కూడా జరిగింది.

ఈలోగా "బలవంతమైన సర్పము చలి చీమల చేతచిక్కి చచ్చు"నేమో అన్నట్టుగా ఒక్కసారి "బుస్స్" మని కేకపెట్టి చీమల్లాంటి అమ్మకందార్లని దులపరించుకుని కదిలింది ట్రైను.

పరువంతో నిండిన పడుచులాగానూ, పళ్ళతో నిండిన కల్పవృక్షం లాగానూ షావుకారి పర్సు పార్థసారధి కళ్ళల్లో కదలాడుతూంది- అంచేతను మరి షావుకారు కనిపించడంలేదు. షావుకారి కొండలాంటి పొట్ట కనిపించడంలేదు. అతడి వివరీతమైన మనుషుల్ని తినే ఆకలి కనిపించడం లేదు. ఇంక పాముల్ని మింగేసినట్టు పొట్ట చేసే బుస్సమనే గురకలూ వినిపించడంలేదు. విలువిద్యా ప్రవీణుడికి గురి ఒక్కటి మాత్రమే కనిపించి మిగతావి కనిపించనట్టుగా షావుకారి పర్సు మాత్రమే పార్థసారధి కళ్ళల్లో కనిపిస్తూంది.

పర్సూ దానిలోని డబ్బూ కళ్ళలో మెదుల్తూండగా ఆలోచిస్తున్న పార్థసారధి మెదడు చాలా విషయాలు తర్కించింది.

ఆ పర్సుగాని దానిలోని డబ్బుగాని లేకపోయినంత మాత్రాన షావుకారికి పోయేదేమీ వుండదు. ఆ మాటకొస్తే అతని ఆస్తంతా ప్రజలకి పంచేసినా అతనికి లోటుండదు. సముద్రంలోని రత్నాలూ, ముత్యాలూ, చేపలూ, జంతువులతోపాటు ఉప్పునుకూడా తీసేసినా నష్టమేమీ లేకపోగా స్వచ్ఛమైన నీరు మిగిలిపోయినట్టుగా అతని శరీరానికీ, మనసుకీ ఎంతో ఆరోగ్యం చేకూరుతుంది కూడాను. పైగా ఎన్ని వెధవపన్లుచేసి, వడ్డీలకి తిప్పి, ఎంతమంది మంగళసూత్రాలు తాకట్టుపెట్టుకుని ఈ డబ్బు సంపాదించేడో, అంచేతనే ఎవడు చూసేస్తాడోనని బెంగ. అలాంటి వాళ్ళని దోచుకోవడమే లోక కళ్యాణం.

ఇకపోతే పర్సూ, అందులోని డబ్బూ తనలాంటివాడి స్వంతమైతే ఎంతో కరువు తీరుతుంది. కొంతమట్టుకైనా అప్పులు తీరతాయి. కొన్నాళ్ళపాటైనా తనూ, భార్య పిల్లలూ కడుపునిండా తింటారు. ఎన్నాళ్ళనుంచో సరియైన బట్టల్లేవని విచారిస్తుండే తన కుటుంబానికి మాన మర్యాదలు కాపాడుకోడానికింత గుడ్డ దొరుకుతుంది. ఇంటివాడి రెణ్నెల్ల అద్దె బాకీ తీరుతుంది. చంటిదానికి రెణ్నెల్లు సరిపడా పాలడబ్బాలు కొనడం జరుగుతుంది. బజార్లో దొరికితే, పలకమాత్రమే ఉండే పెద్దాడి సంచీ పుస్తకాలతో నిండుతుంది. లంచవర్‌లో మంచినీళ్ళు మాత్రం తాగి అలా తిరిగొచ్చేసే తనకిటిఫినో, కాఫీయో తాగే స్తోమత కలుగుతుంది. పెళ్ళానికి కొన్నాళ్ళపాటు ఇరుగింటికీ, పొరుగింటికీ అప్పుకో అరువుకో వెళ్ళే పని మిగుల్తుంది. అన్నింటికంటె ముఖ్యంగా ఇంగువ అయిపోయినా వాసన మిగిలిన డబ్బాలాగా ఇన్నాళ్ళ 'దర్జా' చూపించి 'లాకేత్వం దాక్కొమ్మా' కాకుండా మరి కొన్నాళ్ళపాటు అప్పులు సంపాదించుకోవచ్చు.

అవసరానవసరాల గూర్చి ఆలోచించిన మీదట మొగ్గు చూపించిన మనసు సాధ్యాసాధ్యాల మీదికి పోయింది.

తాలూకాఫీసులో తనసీటు డిస్పాచింగే అయినప్పటికీ అందరితో కలసిమెలసి ఉండటమూ, మంచనిపించుకోవడమూ, సక్రమంగానూ, సకాలంలోనూ అన్నీ డిస్పేచ్ చేసెయ్యడమూ తన సామర్థ్యమే అని పార్థసారధి ఖచ్చితంగా చెప్పగలడు. అంతేకాదు ఏ సీటులో వేసినా "దొరక్కుండా దొంగతనం" చేయగలనని ఢంకామీద దెబ్బకొట్టి మరీ చెప్పగలడు. పోతే అధికారుల మెప్పు సంగతా? ప్రభుత్వ కార్యాలయాల్లో అందునా తాలూకాఫీసులలో గొడ్డు చాకిరీ చేసిన వాళ్ళకి సైతం అధికారులు తిట్లే మెడల్స్‌గా ఇస్తారు. అంచేత మరి తన తెలివితేటలతో పర్సు స్వంతంచేసుకోగలననేఅతనిధీమా. ఇక షావుకారి సంగతి చూద్దామా అంటే లేచి కూర్చోవడమే గగనం. దొంగని పట్టుకునేంత చురుకుదనమెక్కడిదీ? పైగా తిండితిన్న సమయాల్లో నిద్రావస్థలోనే ఉంటాడాయె.

ఒక్క పార్థసారధి తప్ప ఇంటా, బయటా కొంతమంది అతని వెనకా, కొందరు అతని మొఖం మీదనే అతని అసమర్థత గురించి చెప్పుకుంటూనే ఉంటారు. "నీ దస్తూరీ అద్భుతంవాయ్" అని అతని మొఖంమీద అనేవాళ్ళే, "వాడి మొహం ఆఫీస్ లెటర్స్ సరిగా పంపించలేనివాడికి సెక్షనే అనవసరం. మరింకో సెక్షన్లోకి మారిస్తే పనికి రెండు పనే" అని వెనకాల చెప్పుతుంటారు. చివరికి వాళ్ళావిడ కూడా "ఊఁ, సర్లే. ఈయన పనివాడితనమే చెప్పుకోవాలి.... లేతవి చూసి ఏంచి వంకాయలు తీసుకురండని బజారుకి పంపితే నేను మరీమరీ చెప్పినందుకే మా అన్నట్టుగా తెస్తారు వంకాయలు పుచ్చువీ, ముదురువీనూ" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పుతుంది. పార్థసారధి సామర్థ్యం సంగతలా వుంచితే ఆ షావుకారు చూడ్డానికి తిండిపోతూ, నిద్ర పోవడానికి సోమరిపోతూ లాగానే వున్నాడుగాని జేబులోని పర్సునీ, సామాన్లనీ కంట కనిపెడుతూ నేవున్నాడు అంతెందుకూ అతడాక్రమించుకున్న సీటు చివరగా కూర్చోవడంగాని, కిందని అతని సామాన్లప్రక్క ఎవరైనా వెళ్ళి సామాన్లని పెట్టడంగాని చేయబోతే ఘోరంగా భయంకరమైన గొంతుతో కరవరావడం చూస్తూంటే పార్థసారధికి గుండె గతుక్కుమంటున్నది.

* * *

అకస్మాత్తుగా వెనక్కి జేరబడిన పార్థ

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టుద్వారా కూడా వైద్యంచేయబడును.
వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా. రండి.
డా॥ దేవర ఫోన్ 551.
మార్వాడి గుడివద్ద, తెనాలి.
బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు-17

సారధి తన పక్కన సంచీ లేకపోయేసరికి గతుక్కుమన్నాడు ఇటు చూసేడు అటు చూసేడు కనిపించలేదు. ఎంతసేపటి నుంచి తాను షావుకార్నీ అతడి జేబులోని పర్సునీ చూస్తున్నాడో అంతసేపటి నుంచి తన సంచినీ సంచీలోని పనికి మాలిన పాత బట్టల మడతల్లో పనికొచ్చే పదిహేను రూపాయల్నీ చూస్తుండినట్లు అనిపించిన పక్కమనిషి ముఖం మాత్రం పార్థసారధి కళ్ళల్లో కనిపించింది.

షావుకారి విషయంలో సాగిన త ఆలోచనలకి ప్రతిబింబం ఆ పక్క వాడి ముఖం కళ్ళల్లో కనిపించేసరి 'అయ్యో నా సంచీ పోయింది' అనబోయ గొంతు మరి పెగల్లేదు. ★


మొదటి బిడ్డ కోసం అవసర పడవద్దు

రెండవ బిడ్డ అప్పుడే వద్దు

కాబోయే తండ్రులు, తల్లులకు మంచి సలహా

మూడవ బిడ్డ ఎప్పుడూ వద్దు

సరయిన సలహాలు, సాధనాలు సమకూర్చేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. మీ సమీపంలోని కుటుంబ నియంత్రణ కేంద్రము ప్రాథమిక ఆరోగ్య కేంద్రము గ్రామ స్వాస్థ్య సహాయకులు.

ఈవేళే వారిని కలుసుకోండి

davp